భట్టిప్రోలు నాగసుందరి సంక్రాంతి కథానికల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

కథ

# ఒక్క క్షణం

జి. శ్వేత

'కంప్యూటర్ నెట్‌వర్క్స్'

ఎప్పుడూ క్లాసులో ఫస్ట్ వచ్చే శ్వేతకు మింగుడు పడని ఒకే ఒక సబ్జెక్ట్. వచ్చేవారం నుండి సెమ్ ఎగ్జామ్స్ ఉండటంతో బుక్స్ సర్దుకుని బయటకు వచ్చింది. కాలేజీ టైమ్ దాటటం వలన కారిడార్ నిర్మానుష్యంగా ఉంది. నెమ్మదిగా నడుస్తూ వస్తున్న శ్వేతకు మెట్ల దగ్గర గబగబా టెర్రస్ వైపు వెళ్తున్న ఆశ కనిపించింది.

ఆ టైంలో టెర్రస్ వైపు తను వెళ్ళటం చూస్తే ఎందుకో మనసు కీడును శంకించటమే కాకుండా ఉదయం ఫస్ట్ అవర్‌లో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. కంప్యూటర్ లాబ్ నుండి సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న క్లాసుకు వెళ్తున్నప్పుడు ఆశను చూస్తూ రాఘవ 'డైనోసార్లు కూడా కంప్యూటర్లు నేర్చుకుంటున్నాయే' అంటూ కామెంట్ చేశాడు. కాస్త బొద్దుగా ఉండే ఆశనే అన్నాడని అందరికీ అర్థం అయింది. ఆశ వెనకే క్లాసుకు వెళ్తున్న తనుకూడా వినిందా కామెంట్.

ర్యాగింగ్ కామన్ అయిపోయిన ఈ రోజుల్లో తను ఆ విషయం సీరియస్‌గా తీసుకోలేదు. కానీ ఆ విషయం ఆశను హర్ట్ చేసి ఉంటుంది. ఆలోచిస్తూ టెర్రస్ చేరిన శ్వేతకు 5 అంతస్తుల బిల్డింగ్ చివరగా నిలుచుని ఉన్న ఆశ కనిపించింది.

వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆశ తన వెనుక నుంచున్న శ్వేతను గమనించలేదు.

'ఆగిపోయావేం! దూకు ! " అంది శ్వేత.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది ఆశ. బాగా ఏడ్చిందేమో ఎర్రగా ఉబ్బి ఉన్నాయి ఆమె కళ్ళు. అవి అస్తమిస్తున్న సూర్యకాంతిలో మండే అగ్ని గోళాల్లా కనిపిస్తున్నాయి. ఐసెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకున్నావు. రిక్షా లాగుతూ కూడా మీ నాన్న నిన్నింత పెద్ద కాలేజీలో చేరిపించారు. ఏదో బాగా చదివి నీ చెల్లెళ్లకి, తమ్ముడికి అండగా ఉంటావని పాపం ఆశపడుతున్నాడాయన.

నీ ఫీజు కట్టడానికి మీ ఇంటిలో ఎన్ని పూటలు పస్తు ఉంటున్నారో లంచ్ టైమ్‌లో ఒంటరిగా క్లాసులోనే ఉండిపోయే నిన్ను చూస్తే అర్థం అవుతుంది. ఇక్కడ చేరేటప్పుడే ఒక పెద్ద లక్ష్యంతో చేరాం. ఇలాంటి, ఎలాంటి ఇబ్బందులు ఎదురయినా ఆ లక్ష్యం ముందు చిన్నవిగా కనిపించాలి. అప్పుడే మనం లక్ష్యం చేరతాం.

రాఘవ లాంటి చీడపురుగులు సమాజంలో చాలా ఉంటాయి. అలాంటి వాటికి భయపడి మన జీవితాన్ని బలిచేసి మనవాళ్ళ జీవితాలను విషాదమయం చేయటం భావ్యంకాదు.

'పరీక్షలకు ఇంకా వారం రోజులు మాత్రమే ఉన్నాయి. ఫస్ట్ ర్యాంక్ కోసం కష్టపడు. నిన్ను కామెంట్ చేసిన వెధవలకన్నా మంచి మార్కులు తెచ్చుకో. నీ ర్యాంక్ చూసి వాళ్ళు సిగ్గుపడేలా చేయి. 'ఒక్క క్షణం' ఆలోచించు. ఇంకా చావాలనే అనుకుంటే అలాగే చావు. నీ చావు రాఘవ లాంటి వాళ్ళ మనసులు మార్చవు. కానీ నిన్ను నమ్ముకున్న మీ వాళ్ళని జీవితకాలం బాధిస్తుంది.' అంటూ వడివడిగా క్రిందకు వచ్చేసింది శ్వేత.

× × ×

క్లాసులో స్టూడెంట్స్ అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు ప్రిన్సిపాల్ గారికోసం. పిన్ డ్రాప్ సైలెన్స్.

'రిజల్ట్ ఆరోజే ఎనౌన్స్ చేస్తున్నారు.

ఎప్పుడూ ఫస్ట్‌ప్లేస్‌లో ఉండే శ్వేతకు ముచ్చెమటలు పోస్తున్నాయి టెన్షన్‌తో నెమ్మదిగా నడుచుకుంటూ క్లాసులోకి వచ్చారు ప్రిన్సిపాల్ గారు. ఎవరూ విష్ చేయకుండా నిశ్శబ్దంగా నుంచున్నారు. నెమ్మదిగా నవ్వారాయన. టై సరిచేసుకుంటూ డయాస్ మీద నుంచుని స్టూడెంట్స్ వైపు చూస్తూ

'డియర్ స్టూడెంట్స్ ఈ క్షణం మీరెంత ఎగ్జైట్‌మెంట్‌లో ఉన్నారో నేను అర్థం చేసుకోగలను. మిమ్మల్ని మరింత టెన్షన్ పెట్టను. రిజల్ట్ వెంటనే చెప్పేస్తాను' అంటూ అందర్నీ కలియచూశారు. ఆయన చేతిలో ఉన్న రిజల్ట్ పేపర్ స్టూడెంట్స్ కళ్ళకి అణుబాంబుల్లా కనిపిస్తోంది.

ఈసారి సెమ్‌లో ఎక్కువ శాతం పాస్ అయ్యారు. కాని ఆశ్చర్యమేంటంటే ఈసారి ఫస్ట్‌ర్యాంక్ ఎప్పుడూ చివర ఉండే ఆశకు వచ్చింది.

'గివ్ హర్ ఎ బిగ్ హ్యాండ్' అంటూ ముందుకు పిలిచారు. క్లాసు ఒక్కసారి ఉలిక్కిపడింది. శ్వేతకు కలలా అనిపించింది.

ఆశ తనను తానే నమ్మలేకపోయింది. శ్వేత మాటలు తనలో ఎంత ఆత్మవిశ్వాసం పెంచాయో, అది పరిక్షల్లో మార్కులు సంపాదించటానికి తనలో ఎంత కసిని పెంచాయో. ఆనందంతో కళ్ళు కన్నీటి పొరతో కప్పివేయగా శ్వేతవైపు కృతజ్ఞతగా చూస్తూ ప్రిన్సిపాల్ గారి వైపు నడిచింది. అందరితో పాటు తనూ చప్పట్లు కొడుతూ అభినందనగా ఆశ వైపు చూసింది శ్వేత. వెనక్కి తిరిగి వస్తూ రాఘవ బెంచ్ దగ్గర ఆగింది ఆశ.

'డైనోసార్లు కంప్యూటర్లు నేర్చుకోవటమే కాదు. ఫస్ట్ మార్కులు కూడా తెచ్చుకుంటాయి' అని సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ అంది ఆశ.

'సారీ సిస్టర్' అని సిగ్గుతో తలవంచుకుంటూ నెమ్మదిగా గొణిగాడు రాఘవ.

కంప్యూటర్ నెట్‌వర్క్స్‌లో రెండు మార్కులు తక్కువ తెచ్చుకొని సెకండ్‌ర్యాంక్ తెచ్చుకున్న శ్వేత మొదటిసారి మార్కులు తక్కువగా వచ్చినందుకు బాధపడలేదు.

ఆ 'ఒక్కక్షణం' తను ఆశను ఆపకపోయి ఉంటే కరతాళ ధ్వనుల మధ్య గర్వంగా తల ఎత్తుకున్న తన నేస్తం ఏమై ఉండేదో కదా. మనస్సు ఒకసారి తృప్తిగా నిట్టూర్చింది ఓ మంచి పని చేసినందుకు.

ఏమైనా మళ్ళీ ఒకసారి నేను మాత్రం లైబ్రరీకి వెళ్ళాలి కంప్యూటర్ నెట్‌వర్క్స్ పని పట్టడానికి, అనుకుంటూ బుక్స్ సర్దుకుంది శ్వేత. మానవత్వంతో ఫస్ట్‌ర్యాంక్ సంపాదించానన్న ఆలోచన కూడా రాని అమాయకపు చిరునవ్వును ఎప్పటిలా తన పెదవుల మీద చిలికిస్తూ.